క్లుప్తంగా

మెడికల్ కళాశాలలో ఆదివాసీలకే ఉద్యోగాలు కల్పించాలి

గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ



మాట్లాడుతున్న రాధాకృష్ణ

పాడేరు రూరల్: మెడికల్ కళాశాలలో ఆదివాసీలకే ఉద్యోగాలు కల్పించాలని ఆదివాసీ సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఉన్న మెడికల్ కళాశాలలో ఖాళీగా ఉన్న 244 పోస్టులకు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశారని, ఈ పోస్టులను స్థానిక ఆదివాసీ అర్హులకే ఇవ్వాలని కోరారు. స్థానికంగా ఉద్యోగ అవకాశాలు లేక మైదాన ప్రాంతాల్లో వివిధ కంపెనీల్లో పనిచేసేందుకు గిరిజన యువత వలస పోతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని గిరిజన ప్రాంతంలో ఆదివాసీలకే వంద శాతం ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

25న జీకే వీధి మండల సమావేశం

గూడెంకొత్తవీధి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 25న నిర్వహించనున్నట్టు జీకే వీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈసమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

రంపచోడవరం: జిల్లాలో జోరుగా సాగుతున్న అక్రమ కట్టడాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తీగల బాబురావు తెలిపారు. అడ్డతీగల మండల కేంద్రం, డి.భీమవరం, దుప్పులపాలెం గ్రామాల్లో గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలు చేపట్టారని, వాటిని నిలుపుదల చేసి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ సచివాలయ స్థాయి నుంచి సబ్ కలెక్టర్, పీవో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. ఏజెన్సీలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సకాలంలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ



సమావేశంలో మాట్లాడుతున్న పీఎంవో రాంగోపాల్

గూడెంకొత్తవీధి: జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను పంచాయతీ కార్యదర్శులు సకాలంలో జారీచేయాలని ఐటీడీఏ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ అధికారి (పీఎంవో) రాంగోపాల్ అన్నారు. గూడెంకొత్తవీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావుతో కలసి ఆయన మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఎస్‌పీసీఐ, ఈకేవైసీ, ఇంటింటి సర్వే వంటి అంశాలను సత్వరమే పూర్తిచేయాలని ఆదేశించారు.

తారు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



తారురోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీటీసీ నైని రజని, సర్పంచ్ సన్నిబాబు

హుకుంపేట: మండలంలోని భీమవరం పంచాయతీ గంగరాజుపుట్టు జంక్షన్ నుంచి గుమ్మడి గండువ, మధలపురం, గంగవరం గ్రామాల మీదుగా బొడ్డాపుట్టు వరకు ఎస్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన తారురోడ్డు నిర్మాణానికి స్థానిక ఎంపీటీసీ నైని రజని,సర్పంచ్ నైని సన్నిబాబు మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణానికి రూ.5.50కోట్లు మంజూరైనట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నైనిసత్తిబాబు,ఇతర పార్టీల నాయకులు శంకర్‌నాయుడు,జన్ని బొరరావు, గణేష్, కర్రిబాబు,భీమరావు, చిన్నరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో దాహం కేకలు

గిరి గ్రామాల్లో వేసవికి ముందే తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది.గొంతు తడుపుకొనేందుకు గుక్కెడు నీరు దొరక్క ప్రజలు అల్లాడుతున్నారు. మారుమూల గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. చాలా గ్రామాల ప్రజలు ఊటగెడ్డలు, పారే నీరు పై ఆధారపడి తాగునీటి అవసరాలను తీర్చుకుంటున్నారు. రబీ సీజన్ కావడంతో ఊటగెడ్డల నీటికి రైతులు అడ్డుకట్టవేసి, పొలాలకు మళ్లించడంతో కింద గ్రామాలకు ఆ నీరు చేరడంలేదు. దీంతో **దాహార్తి తీర్చు**కోవడానికి పలు గ్రామాల ప్ర**జలు అవ**స్థలు పడుతున్నారు. చాలా గ్రా**మాల్లో జల్** జీవన్ పనులను అసంపూర్తిగా **నిలిచిపోవ**డంతో నీటి సరఫరా జరగడం **లేదు. అధి**కారుల నిర్లక్ష్య ధోరణి కారణం**గా అర**కులోయ మండలంలోని పలు **గ్రామాల** ప్రజలు బిందెడు నీటి కోసం **నానాపాట్లు** పడుతున్నారు.

- ఊట గెడ్డల నీరూ లభ్యంకాని వైనం
- మైళ్లకొద్దీ నడిచివెళ్లినా బిందెనీరు కరువు
- కలుషిత నీరుతాగి వ్యాధుల బారిన పడుతున్న జనం
- పట్టించుకోని అధికారులు



ఊట గెడ్డ నీటిని సేకరిస్తున్న మహిళలు

అరకులోయటౌన్: మండలంలోని 66 గ్రామాల్లో తాగునీటి ఎద్దడితో తీవ్రంగా ఉంది. శ్రమకోర్చి దూరంగా ఉన్న ఊట గెడ్డలకు వెళ్లినా నీరు లభించడం లేదు. అడుగంటిన కొద్దిపాటి కలుషిత నీటిని తెచ్చుకుని వినియోగిస్తుండడంతో వ్యాధుల బారిన పడుతున్నారు. మండలంలోని 14 పంచాయతీల్లో 254 గ్రామాలున్నాయి. వీటిలో 66 గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. ఈ గ్రామాల్లో సుమారు 12 వేల మంది జనాభా నివసిస్తున్నారు. మారూమూల ఉన్న ఈ పల్లెల్లో కనీసం బావులు కూడా లేవు. దీంతో వీరంతా తాగునీటి అవసరాల కోసం ఊట గెడ్డలపై ఆధారపడుతున్నారు. ఎగువ గ్రామాల్లో ఉన్న రైతులు ఊటగెడ్డల నీటిని పంటపొలాలకు మళ్లించడంతో కిందకు నీరు రావడంలేదు. దీంతో చాలా గ్రామాల ప్రజలు దాహంతో అల్లాడుతున్నారు. రానున్న వేసవిని తలచుకుని ఆందోళన చెందుతున్నారు.

➡ మారుమూల ఇరగాయి పంచాయతీ పరిధిలోని ఉరుములు, వల్దీ పనస, బలియగుడ, దోనిగుమ్మి, జర్మనిగుడ పైవీధి, బొర్రా కొండ గ్రామాల ప్రజలకు తాగునీరు అందుబాటులో లేదు. దీంతో ఈ గ్రామాల ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.

బోర్‌వెల్ వేసినా...

వల్దీపనస గ్రామంలో 41 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ గ్రామంలో జల్‌జీవన్ మిషన్ నిధులతో బోర్ వెల్ వేశారు. ట్యాంక్, పైప్ లైన్ ఏర్పాటు చేయకపోవడంతో నీటి సరఫరా కావడం లేదు. దీంతో గ్రాస్తులు ఊట గెట్ట నీటిని తాగేందుకు వినియోగించవలసి వస్తోంది.

➡ ఇరగాయి పంచాయతీ బలియగుడ, దోనిగుమ్మి, జర్మనిగుడ పైవీధి, బొర్రా కొండ గ్రామాల గిరిజనులు తీవ్ర తాగునీటి సమస్యతో సతమతమవుతున్నారు. ఊట గెడ్డల నుంచి నీటిని సేకరించి, తాగునీటిగా వినియోగించి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఇప్పటికైన ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.



ఉరుములు గ్రామంలో వాటర్ సప్లై లేకుండా ఏర్పాటు చేసిన కుళాయి

మండలం : అరకులోయ

పంచాయతీలు	14
గ్రామాలు	254
తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న గ్రామాలు	66
వీటిలో నివసిస్తున్న జనాభా	12 వేల మంది



వల్దీపనసలో బురద నీటిలో నుంచి ఊట నీటిని సేకరిస్తున్న మహిళలు

నిరుపయోగంగా ట్యాంక్, ట్యాప్‌లు

ఉరుములు గ్రామంలో 62 కుటుంబాలు నివసిస్తున్నాయి. **ఊట** గెడ్డల నీటిని తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు **జల్ జీవన్** మిషన్ నిధులతో బోర్ వెల్ తవ్వకుండానే నీటి నిల్వ చేసే ట్యాంక్ నిర్మించి, పైప్‌లైన్ వేసి గ్రామంలో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేశారు. బోర్ వెల్ వేయకపోవడంతో ట్యాంక్, ట్యాప్‌లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.



ఉరుములు గ్రామంలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

ఎవరూ పట్టించుకోవడం లేదు



గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. పలుమార్లు అధికారులకు తెలిపినా కనీసం పట్టించుకోలేదు. వేరే దారిలేక గెడ్డ నీటిని వినియోగిస్తున్నాం. కలుషిత నీటిని తాగుతుండడంతో వ్యాధుల బారిన పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తాగునీటి సౌకర్యం కల్పించాలి.

– పోయా దేవి, ఉరుములు, అరకులోయ మండలం

అసంపూర్తిగా జల్‌జీవన్ పనులు



ఉరుములు గ్రామంలో జల్‌జీవన్ మిషన్(జేజేఎం) నిధులతో ట్యాంక్, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు. కానీ బోర్ వేయడం మరిచారు. వల్దీ పనస గ్రామంలో బోర్ వేశారు. ట్యాంక్, పైపులైన్ వేయకుండా విడిచి పెట్టారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారు. ఇలా అసంపూర్తిగా పనులు విడిచి పెట్టడంతో ప్రజా ధనం వృథా అవుతోంది. ఇరగాయి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో వేసవి రాకముందు నీటి సమస్యను తీర్చాలి.

– మాదల బుటికి, సర్పంచ్, ఇరగాయి పంచాయతీ, అరకులోయ మండలం

వేసవిలో బోర్ నిర్మిస్తాం

ఉరుములు గ్రామంలో ట్యాంక్, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశాం. ఆ గ్రామానికి వెళ్లే రహదారి బాగోలేదు. వర్షాకాలంలో బోర్ వేసేందుకు లారీ వెళ్లలేని పరిస్థితి. దీంతో కొండపైనుంచి ఊట నీటిని పైపులైన్ ద్వారా ట్యాంక్‌కు కనెక్షన్ ఇచ్చి, ఇంటింటికీ నీటి సరఫరా చేస్తామని చెప్పాం. గ్రామస్తులు అంగీకరించలేదు. రహదారి బాగుంటే ఈ వేసవిలో బోర్ వేసి, ఇంటింటికీ నీటిని సరఫరా చేస్తాం.

– రుక్మంధర్‌రావు,డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, అరకులోయ

వైఎస్సార్‌సీపీ నేత మృతి.. ఎమ్మెల్యే నివాళి



అంజలి శనివారంలో పాడె మోస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

చింతపల్లి : మండలంలో అంజలి శనివారం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కిముడు సింహాచలం అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం పాడె మోసి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ఆర్థిక సాయం చేశారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి జల్లి సుదాకర్,మండల అధ్యక్షుడు మోరి రవి వైస్ ఎంపీపీ సాగిన వెంగళరావు తదతరులున్నారు.

ఘనంగా మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



జ్యోతి వెలిగించి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ సుబ్బారావు

ఎటపాక: రిపబ్లిక్‌డే సందర్భంగా ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రీడా పోటీలు మంగళవారం నల్లకుంట ఆశ్రమ పాఠశాలలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తహసీల్దార్ కారం సుబ్బారావు జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించి, మాట్లాడారు. క్రీడలు విద్యార్థుల్లో మానసిక,శరీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తెలిపారు. రెండు రోజులు జరిగే ఈ పోటీల్లో అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మొదటి రోజు సీనియర్,జూనియర్ విభాగాల్లో బాలురు,బాలికలకు కబడ్డీ,ఖోఖో,వాలీ బాల్ పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎంలు కణితి శేఖర్,తాటి సీతారాములు,లక్ష్మి, విజయ్,వెంకటేశ్వర్లు,నిర్వాహణ కమిటీ సభ్యులు ప్రసాద్,పూసం శ్రీను,కాక రాజు,భీమయ్య,పీడీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తాగునీటి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రంగమ్మ, సర్పంచ్ అభిరామ్

కూనవరం: తాగునీటి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పాయం రంగమ్మ, చినార్కూరు సర్పంచ్ సున్నం అభిరామ్ అన్నారు. చినార్కూరు పంచాయతీ తెల్లవారి గుంపులో నెలకొన్న తాగునీటి ఎద్దడిని నివారించేందుకు పంచాయతీ నిధులు సుమారు రూ.లక్షతో ఏర్పాటు చేసిన మంచినీటి పథకాన్ని మంగళవారం వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చాలా కాలంగా తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న తెల్లవారి గుంపు ప్రజలకు తాగునీటి కష్టాలు తీరాయని, రానున్న వేసవిలో ఈపథకం చుట్టు పక్కల వారి దాహార్తిని సైతం తీరుస్తుందన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివమణికంఠ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శివశంకర్, తెల్లం సురేష్, తెల్లం గోపయ్య, సున్నం వెంకయ్య, సావిత్రి, విజయమ్మ, శ్రావణి, శిరీషా,లక్ష్మి, వెంకటేష్, తమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ఈవోపీఆర్‌డీ



రామాంజనేయ ప్రసాద్

కూనవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్‌డీగా విధులు నిర్వహిస్తున్న రామాంజనేయ ప్రసాద్ మంగళవారం ఎంపీడీవో (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఎంపీడీవో (ఎఫ్ఏసీ)గా పనిచేసిన కె.ఆర్. విజయ బదిలీపై అడ్డతీగల మండలం ఎంపీడీవోగా వెళ్లారు. ఆ స్థానంలో రామాంజనేయ ప్రసాద్ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు.

లైంగిక వేధింపులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ కళాశాల విద్యార్థినులను లైంగికంగా వేధించిన ఫిజికల్ డైరెక్టర్ కంగల పోతురాజుపై క్రిమినల్ కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు డిమాండ్ చేశారు. పౌరహక్కుల సంఘం ఐదుగురు సభ్యులతో నిజనిర్ధారణ కమిటీగా ఏర్పాటుచేసి, డిసెంబరు 23న కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్‌లు, విద్యార్థినులను కలిసి విచారణ చేసినట్టు తెలిపారు. విచారణలో పీడీ దాడి చేయడంతో పాటు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్టు వెల్లడి అయిందన్నారు. ఆదివాసీ విద్యార్థినుల ఫిర్యాదుపై క్రిమినల్ కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ఎస్‌ఐపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్, తెలుగు లెక్చరర్‌ను కొట్టిన ఘటనపై కూడా కేసు కూడా నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధి నిధులతో వందనపల్లికి తారురోడ్డు



వందనపల్లికి వేస్తున్న తారురోడ్డు

ముంచంగిపుట్టు: మండలంలో బంగారుమెట్ట పంచాయతీ సోలగంపుట్టు నుంచి వందనపల్లి వరకు ఉపాధి నిధులు రూ.60లక్షలతో తారురోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ వంతాల రత్న,ఎంపీటీసీ చెండా కొండమ్మ,వైఎస్సార్‌సీపీ నేతలు పనులను పర్యవేక్షించారు.రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు మోహన్‌రావు, జగన్నాథం, కొండలరావు, వార్డు మెంబర్ సోమన్న తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు మందులు పంపిణీ చేస్తున్న జేడీ ఈశ్వరరావు



గేదెలకు గర్భకోశ చికిత్స చేస్తున్న పశు వైద్యులు



జడ్డంగిలో కోడికి టీకా వేస్తున్న పశుసంవర్ధకశాఖ ఏడీ గణేశ్



గడుగుపల్లిలో మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్న పశు వైద్య సిబ్బంది



శబరి కొత్తగూడెంలో మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రంగమ్మ



మినుములపుట్టులో పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది



వంజరిలో మేకకు టీకా వేస్తున్న సిబ్బంది

దేవీపట్నం: ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యశాఖ జేడీ, ప్రత్యేకాధికారి ఈశ్వరరావు తెలిపారు. ఇందుకూరుపేటలో మంగళవారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పశువైద్యశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు తమ శాఖ ద్వారా అందుతున్న సేవలపై అవగాహన కల్పించారు. ఉచిత టీకాలు, మినీ గోకులాలు, బహు వార్షిక పశుగ్రాస సాగు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశువులకు కావలసిన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీడీ అహ్మద్ షరీఫ్, ఏడీ సూర్యనారాయణ, డాక్టర్ రేవంత్ తదతరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: పశువుల్లో సీజనల్‌గా వచ్చే వ్యాధుల నివారణకు కృషి చేస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్.సతీష్ తెలిపారు. మండలంలోని ధాన్యంపాలెం,గొంటువానిపాలెం గ్రామాల్లో మంగళవారం పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో పునరుత్పత్తి సమస్యలు,వాటి పరిష్కారం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ధాన్యంపాలెంలో 201 పశువులు,మేకలు,గొర్రెలకు జలగ నివారణ మందులు అందించినట్టు చెప్పారు. 10 పశువులకు గర్భకోశ చికిత్స, 181 కోళ్లకు కొక్కెర తెగులు నివారణకు టీకాలు, 41 పశువులకు సాధారణ చికిత్సలు చేసినట్టు తెలిపారు.గొంటువానిపాలెంలో 165 పశువులకు జలగ నివారణ మందులు ఇచ్చినట్టు చెప్పారు.12 పశువులకు గర్భకోశ చికిత్స, చేసి, 195 కోళ్లకు కొక్కెర తెగులు నివారణ టీకాలు వేసినట్టు తెలిపారు.34 పశువులకు సాధారణ చికిత్సలు చేశామన్నారు.

పెదబయలు: ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు స్థానిక పశువైద్య అధికారి సౌజన్యదేవి తెలిపారు. మండలంలోని కిముడుపల్లి పంచాయతీ గడుగుపల్లిలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించి 137 గొర్రెలు, మేకలు, 56 దుక్కి టిద్దులు,27 పెయ్యలకు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్టు చెప్పారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును అందజేసినట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ శోభరాణి, పశువైద్య సిబ్బంది స్వామి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.


రాజవొమ్మంగి : మండలంలోని జడ్డంగి పశువుల ఆస్పత్రి వద్ద మంగళవారం నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆ శాఖ ఏడీ సీహెచ్. గణేష్ పర్యవేక్షించారు. కోళ్లకు జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. 89 తెల్లజాతి, 45 నల్లజాతి పశులకు, 55 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. సిబ్బంది లక్ష్మణరావు, వీరబాబు, సుబ్బరాజు, రమణ, చిన్నయ్య, వెంకటేష్, రవికుమార్ పాల్గొన్నారు.

కూనవరం: మండలంలో నిర్వహిస్తున్న పశుఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జావిజయ సూచించారు. జగ్గవరం, కొండ్రాజుపేట పంచాయతీ శబరి కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరాలను మంగళవారం వారు ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పశువుల ఆరోగ్యం పట్ల పాడి రైతులు శ్రద్ధ చూపాలని తెలిపారు. కాగా ఈశిబిరంలో 200 మేకలు, 20 గేదెలు, 50 తెల్ల పశువులు, 500 కోళ్లకు మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వెటనరీ డాక్టర్ మాధవీలత, సిబ్బంది వెంకయ్య, లక్ష్మణరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగుల(పాడేరు రూరల్): పశువైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి డాక్టర్ సృజనకుమారి తెలిపారు. మంగళవారం జి.మాడుగుల మండలం వంజరి పంచాయతీలో పశు వైద్యశిబిరం నిర్వహించి పశువులు, మేకలు,గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పశువులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని రైతులకు సూచించారు. ప్రతి పంచాయతీ కేంద్రంలో పశువైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకట్, కొండబాబు, రఘునాథ్,శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: పశువులకు వచ్చే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారిణి ఎం.సౌజన్యదేవి అన్నారు.మండలంలోని పెదగూడ,కిలగాడ,మినుములపుట్టు,కర్రిముఖిపుట్టు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలను మంగళవారం నిర్వహించారు.పశువులు,మేకలకు వ్యాధులు రాకుండా టీకాలు వేశారు. ఈ సందర్భంగా సౌజన్యదేవి మాట్లాడుతూ పశువుల సంరక్షణ కోసం పశు వైద్య సిబ్బంది సూచనలు తప్పకుండా పాటించాలని తెలిపారు. ఈ నెల 31వ తేదీ లోగా అన్ని పంచాయతీల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

పేద వృద్ధులకు రగ్గుల పంపిణీ



రగ్గులు పంపిణీ చేస్తున్న వర్షిన్ మీడియా లిమిటెడ్ సేవ సంస్థ ప్రతినిధులు

పాడేరు రూరల్: పాడేరు,హుకుంపేట మండలాల పరిధిలో ఉన్న సన్యాసమ్మపాలెం, పలు గ్రామాల్లో మంగళవారం వర్షిన్ మీడియా లిమిటెడ్ సేవ సంస్థ ఆధ్వర్యంలో సుమారు 30 మంది పేద వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈ సంస్థ ప్రతినిధులు చెండ అయ్యప్ప, రాంబాబులు మాట్లాడుతూ భవిష్యత్తులో జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

శ్రమదానంతో పాఠశాల షెడ్ నిర్మాణం



వీరవరంలో షెడ్ నిర్మిస్తున్న గ్రామస్తులు

చింతపల్లి: మండలంలోని వీరవరంలో పాఠశాల షెడ్ నిర్మాణాన్ని గ్రామస్తులు శ్రమదానంతో చేపట్టారు. బలపం పంచాయతీ పరిధిలో గల ఈ గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేసి దశాబ్దాలు గడుస్తున్నా పక్కా భవనం లేక విద్యార్థులు అవస్థలకు గురవుతున్నారు. సరైన వసతి లేక ఆరుబయట వరండా,ఇళ్ల అరుగులు మీద విద్యార్థులకు పాఠాలు బోధించవలసి వస్తోంది.ఈ నేపథ్యంలో విద్యార్థుల కోసం రేకుల షెడ్ నిర్మించేందుకు గ్రామస్తులు నడుంబిగించారు. ఆ గ్రామ వార్డు సభ్యుడు పాంగి లింగరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు . ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లడతూ ఇప్పటి వరకు అధికారులు... విద్యార్థులకు ఎటువంటి సౌకర్యం కల్పించకపోవడంతో తామే కొంత నీడ కల్పించుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలకు పూర్తిస్థాయిలో భవనం నిర్మించాలని కోరారు.

యువత అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలి

గంగవరం : యువత అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని, పోలీసుశాఖ కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎస్ఐ బి.వెంకటేష్ తెలిపారు. మంగళవారం రాత్రి పాతగంగవరం, కుసుమరాయి గ్రామాల్లో ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మద్యం, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. 18 నుంచి 26 ఏళ్ల మధ్య వయస్సు గల యువతీయువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.